క్లుప్తంగా

హజ్ యాత్రికులు జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యం విషయంలో హజ్ యాత్రికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. గురువారం ఆయన తన చాంబర్‌లో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. హజ్ యాత్రకు వెళ్లే 250 మందికి వ్యాక్సినేషన్ అందించాలని సూచించారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు, సూచనలు అందించాలన్నారు. ఏ మందులు, ఏ సమయంలో వాడాలో చెప్పాలని తెలిపారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలను అక్కున చేర్చుకుందాం



ప్రత్యేక దత్తత కేంద్రంలో పాలడబ్బాలు, దుస్తులు అందజేస్తున్న డాక్టర్ బి. శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్):అనాథ పిల్లలను అక్కున చేర్చుకుని ఆదరించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. గురువారం ఆయన నగరంలోని సి.క్యాంపు సెంటర్‌లో ఉన్నన జిల్లాల బాలల సంరక్షణ విభాగంలోని ప్రత్యేక దత్తత కేంద్రం వద్ద అనాథ చిన్నారులకు పాలడబ్బాలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ అన్న భావన వారిలో రాకుండా అప్యాయత అనురాగం పంచాలని సూచించారు. ముక్కుపచ్చలారని చిన్నారులను చెత్తకుప్పలో పారవేయడం బాధాకరమన్నారు.

పోషకాహార పునరావాస కేంద్రం తనిఖీ



చిన్నారి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్‌ఆర్‌సీ)తో పాటు స్పెషల్ న్యూబార్న్ కేర్‌లను గురువారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. పోషకాహార లోపంతో ఎన్‌ఆర్‌సీకి వచ్చిన పిల్లల తల్లిదండ్రులతో వారి పిల్లలకు అందుతున్న ఆరోగ్యసేవలు, అందిస్తున్న పోషకాహారం గురించి ఆరా తీశారు. పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇప్పించాలని సూచించారు. స్పెషల్ న్యూ బార్న్ కేర్‌లో పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. అక్కడ రికార్డులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన వెంట చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు, వైద్య సిబ్బంది ఉన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



సంతకాలు సేకరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కర్నూలు రూరల్ : రెజ్లర్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో బ్రిజ్ భూషణ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ సంతకాల సేక రణ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాధాకృష్ణ, అంజిబాబు మాట్లాడారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఫాస్ట్ ఎక్స్, కస్టడీ, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్–2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫాస్ట్ ఎక్స్, బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఉగ్రం, విరుపాక్ష
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ, ఉగ్రం, హసీనా, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
భరత్ కాంప్లెక్స్ : కథ వెనుక కథ, పొన్నియిన్ సెల్వన్–2, ది కేరళ స్టోరీ
శ్రీరామ : రామబాణం
రాజ్ : ఫాస్ట్ ఎక్స్
విజయ : ది కేరళ స్టోరీ



చీరకొంగే రక్షణ..





హే భగవాన్

కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న సూర్య ప్రతాపంతో జనం విలవిలలాడిపోతున్నారు. బయటకు రావాలంటే భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే నగర వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గురువారం మధ్యాహ్నం కర్నూలులో ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ సమయంలో వివిధ పనుల మీద బయటకు వచ్చిన పాదచారులు, వాహనదారులు ఎండవేడిమిని తట్టుకోలేక లస్సీ, చెరుకురసం, టెంకాయ నీళ్లు తాగుతూ సేదతీరారు. సూర్య ప్రతాపం నుంచి రక్షించుకునేందుకు కొందరు తలకు టోపీలు, తువాళ్లు ధరించారు. మహిళలు కొంగులు అడ్డం పెట్టుకుని, గొడుగులు పట్టుకుని నడుస్తూ కనిపించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



తలపై తువాల్ వేసుకుని వడివడిగా..









ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం నగరంలోని వివిధ ప్రాంతాల్లో చల్లని పానీయాలు సేవిస్తున్న దృశ్యాలు



గొడుగు నీడలో..

సమాజాన్ని చైతన్య పరిచేవి సాంఘిక నాటికలు



ఒక్క క్షణం నాటికలోని ఓ సన్నివేశం,



కళాకారులకు జ్ఞాపిక బహూకరిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: సామాజాన్ని చైతన్య పరిచేవి సాంఘిక నాటికలని పీఎంకేఎం వ్యవస్థాపకులు వెంకటరమణ అన్నారు. పీఎంకేఎం, వైఎస్సార్ కళాపరిషత్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 42వ జాతీయ స్థాయి నాటిక పోటీలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం 82 సమాజాలు దరఖాస్తు చేసుకోగా 40 సమాజాలకు అవకాశం కల్పించామన్నారు. ఎనిమిది ప్రాంతాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో ఎంపికైన వాటికి చివరిగా జనవరిలో ఒంగోలులో పోటీలు నిర్వహిస్తామన్నారు. టీజీవీ కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మూడురోజుల పాటు కనువిందు చేసే నాటకాలు కర్నూలుకు రావటం సంతోషదాయకమన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు విశాఖ పట్నం కళాభినయ వారి ×ఓ కాశీ వాసీ రావయ్యా×, రాత్రి 7.30 గంటలకు వీరన్న పాలెం కళానికేతన్ వారి ×స్థిరాస్తి×, రాత్రి 8.30 గంటలకు ఒంగోలు గొల్లపల్లి ఆర్ట్స్ వారి ×కనిపించే దైవం× నాటికలు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు యాగంటీశ్వరప్ప, పాండురంగయ్య, ఇనాయతుల్లా, పీఎంకేఎం పీఆర్వో బొర్రా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

కళా శోభా క్రియేషన్స్ వారి ×ఒక్క క్షణం×, గుంటూరు శ్రీ అమృతలహరి థియేటర్స్ వారి ×నాన్నా... నేనొచ్చేస్తా×, విజయవాడ హర్ష క్రియేషన్స్ ×వారి స్వర్ణ కమలాలు× నాటికాలు ప్రదర్శనలు చూపరులను అలరించాయి.

అశోక్‌నగర్‌లో ఆక్రమణల తొలగింపు



అశోక్‌నగర్ మున్సిపల్ పార్కు వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్): స్థానిక అశోక్‌నగర్‌లోని కేఎస్‌ఆర్ స్కూల్ సమీపంలో మున్సిపల్ పార్కు వద్ద ఉన్న అక్రమణలను గురువారం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగించారు. స్థానిక అపార్టుమెంట్‌కు చెందిన వారు పార్కు వద్ద మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి గ్రిల్ వేయడం, చెట్లు నాటడం చేశారు. దీని వల్ల ట్రాఫిక్‌ను అంతరాయం కలుగుతోందని ఆ ప్రాంతానికి చెందిన కొందరు కలెక్టర్ సృజనకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన అడిషనల్ సిటీ ప్లానర్ శశిలత, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దామోదర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హరీష్ చౌదరి నేతృత్వంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. మున్సిపల్ స్థలాల్లో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వికలాంగులు, మందాకృష్ణ మాదిగ

కర్నూలు(సెంట్రల్): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట వికలాంగుల సమస్యలపై మంధాకృష్ణ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలన్నారు. వివిధ కారణాలతో తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలన్నారు. వికలాంగుల వివాహం కోసం ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ.3 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు, పెద్ద సంఖ్యలో వికలాంగులు పాల్గొన్నారు.

గుత్తి సెబ్ సీఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): తన భర్తపై అన్యాయంగా పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపిన గుత్తి సెబ్ సీఐ వరాలలక్ష్మిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని తుగ్గలి మండలం గుడుంభాయ్ తండాకు చెందిన లలిత బాయి అనే మహిళ డిమాండ్ చేసింది. గురువారం ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తన భర్త గుత్తిలో బామాల్ నాయక్ పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఇటీవల గుత్తి సీఐ రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిందని, ఇవ్వకపోవడంతో నాటుసారా అమ్ముతున్నట్లు కేసు నమోదు చేసి అన్యాయంగా పీడీ యాక్ట్ కింద అరెస్టు చేశారన్నారు. వెంటనే ఈ సంఘటనపై విచారణ జరపాలని ఆమె కోరారు.

నటరాణి పురస్కార గ్రహీత అరుణకుమారి



కేక్ కట్ చేస్తున్న అరుణకుమారి, సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: రంగస్థల కళాకారిణి అరుణకుమారికి 'నటరాణి' పురస్కారాన్ని తిరుపతి శ్రీ వంశీ కళా పరిషత్ వారు ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు గురువారం మద్దూరు నగర్ పింగళి సూరన తెలుగు తోటలో ఆమెను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య మాట్లాడుతూ అరుణకుమారి రాయలసీమ జిల్లాల్లో ప్రఖ్యాత రంగస్థల కళాకారిణిగా గుర్తింపు పొందారన్నారు. కళా సేవకు గుర్తింపుగా నటరాణి పురస్కారం అందుకోవడం హర్షనీయమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫివుల్లా, సభ్యులు ఎం.రాజారత్నం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని



తడకనపల్లెలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలోని శ్రీనగర్ కాలనీ, మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలు/వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనకు సీఎంగా పట్టం కట్టాలని కోరారు. కాగా గ్రామంలో తాగునీటి, డ్రైనేజీ కాలువల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, తడకనపల్లె గ్రామ నాయకులు సోమన్న యాదవ్, కృష్ణారెడ్డి, నరసింహులు, లక్ష్మన్న, చిన్నస్వాములు, రామిరెడ్డి, దమోదర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎడిఫై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ గోడౌన్ దగ్గర ఏర్పాటు చేసిన ఎడిఫై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర బాబు మాట్లాడుతూ ఫీజుల పేరుతో వేల రూపాయలు దోచుకుంటున్న ఈ విద్యాసంస్థ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కిన ఈ విద్యాసంస్థను వెంటనే సీజ్ చేయాలన్నారు.

19న శనీశ్వరుడి జయంతి

కర్నూలు కల్చరల్: వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనీశ్వరుడి జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటలకు నవగ్రహ, లక్ష్మి గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం, కార్యసిద్ధి అంజనేయ స్వామికి సింధూరార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

కర్నూలు రూరల్ : జిల్లాలో నకిలీ పత్తి, మిరప విత్తనాల విక్రయాలను అరికట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.జగన్నాథం ఓ ప్రకటనలో కోరారు. ఈ అంశంపై ఈనెల 20వ తేదీన మండలాల్లోని వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

గోశాలలో బండ పరుపునకు ఆర్థిక సాయం

కర్నూలు కల్చరల్: జిల్లా గోరక్షణ శాలలో టీజీవీ ట్రస్ట్ రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసి న గ్రానైట్ బండ పరుపు పనులను ట్రస్ట్ అధ్యక్షు డు, పారిశ్రామికవేత్త టీజీ భరత్ గురువారం ప్రారంభించారు.ముందుగా గోశాలలో ధన్వంత రీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీ భరత్, అవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు,గాయత్రీ గో శాల అధ్యక్షుడు జగదీష్‌గుప్త, గౌరవ అధ్యక్షుడు విజయ్ కుమార్, కోశాధికారి ఇల్లూరు రాజ్య లక్ష్మి, మాజీ పాలకమండలి సభ్యులు శ్రీకాంత్, ఆవోపా ,గాయత్రీగోసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఈరోజు

ముగియనున్న ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్ష

కర్నూలు సిటీ: జవహర్‌లాల్ నెహ్రూ (అనంతపురం)విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా ఏపీ ఈఏపీ సెట్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్ష శుక్రవారంతో ముగియనుంది. నాలుగో రోజైన గురువారం జరిగిన పరీక్షలకు కర్నూలు జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 843 మందికిగాను 791 మంది, మధ్యాహ్నం 844 మందికిగాను 798 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 488 మందికిగాను, 456 మంది, మధ్యాహ్నం పరీక్షకు 487 మందికిగాను 458 మంది విద్యార్థులు హాజరయ్యారు.

క్రైం కార్నర్

భారీగా రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు : డోన్ పట్టణం చిగురుమానుపేటకు చెందిన పింజరి అలి కర్నూలు పట్టణానికి చెందిన దిలీప్, ఎరుకలి నరసింహులుతో కలసి రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో నిఘా వేసిన విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్, తహసీల్దార్ వెంకటనారాయణ, ఎఫ్ఐ రాజశేఖర్ తదితరులు గురువారం బియ్యంతో వెళ్తున్న లారీని బళ్లారి చౌరస్తాలో పట్టుకున్నారు. అందులో 525 బస్తాల్లో 237.20 క్వింటాళ్ల బియ్యం ఉండగా స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా పింజరి అలీ డీలర్ల వద్ద సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతంలో నిల్వ ఉంచి లారీలో తరలిస్తున్నట్లు తెలిసింది.

ఎస్‌బీఐ ఆర్‌ఎంపై అట్రాసిటీ కేసు నమోదు

కర్నూలు: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సూర్యప్రకాష్‌పై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కర్నూలు పాతబస్తీలోని మించిన్ బజార్ బ్రాంచ్ మేనేజర్ సంగాల లావణ్యను కొంతకాలంగా సూర్యప్రకాష్ అవమానిస్తున్నట్లు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐపీసీ 354డి సెక్షన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఒకటో పట్టణ సీఐ తిమ్మారెడ్డి తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు



సారా విక్రేత విజయుడును అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని గీతాముఖర్జీ నగర్ శివాలయం వద్ద ఉన్న కంప చెట్లలో సారా విక్రయిస్తున్న బద్దేటి విజయుడును నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నందికొట్కూరు మండలం కోళ్లబాపురం గ్రామానికి చెందిన ఇతను అక్కడినుంచి సారా తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రెండు ప్లాస్టిక్ సంచుల్లో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు నాలుగో పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు.

పెద్దాసుపత్రిలో అఖిలప్రియ

కర్నూలు(హాస్పిటల్): ఆళ్లగడ్డ తెలుగుదేశం పార్టీ నాయకురాలు, మాజీ మంత్రి అఖిల ప్రియ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేరారు. మంగళవారం రాత్రి నంద్యాలలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు లోకేష్ పాదయాత్ర సందర్భంగా స్థానిక నాయకులు ఏవీ సుబ్బారెడ్డిపై అఖిలప్రియ అనుచరులు దాడి చేశారు. ఈ కేసులో ఏవీ సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు అఖిలప్రియను పోలీసులు అరెస్టు చేసి 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపించారు. ఈ మేరకు ఆమెను కర్నూలులోని మహిళా సబ్‌జైల్‌లో ఉంచారు. గురువారం రాత్రి ఆమె ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో జైలు సూపరింటెండెంట్ చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించారు. రాత్రి 11.30 గంటలకు ఆమె ఆసుపత్రికి చేరుకున్నారు. క్యాజువాలిటీలో ఆమెకు ఈసీజీ పరీక్ష నిర్వహించి, ఆ వెంటనే కార్డియాలజీ విభాగంలో పంపించారు. అక్కడ ఆమెకు మళ్లీ ఈసీజీ, 2డి ఎకో పరీక్ష నిర్వహించారు. అన్ని రిపోర్టులు నార్మల్‌గా ఉండటంతో తిరిగి జైలుకి పంపించారు.

ముందుగానే సమాచారం అందించాలి

కల్లూరు: ఒక రోజు ముందుగానే గ్రామాల్లో సమాచారం ఇచ్చి ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపుల్లో పాల్గొనేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్ల గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఓపీకి వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేయాలన్నారు. మధ్యాహ్నం ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులను కలుసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈడీడీ క్యాలెండర్‌లో ఉన్న ప్రమాదకర గర్భిణిలను ప్రసవానికి వారం ముందుగా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. గర్భిణులకు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. రక్తహీనత కల్గిన వారిని గుర్తించి తగు చర్యలు మందులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.